# పుస్తక పరిచయం




**Available at:**
*Visalandhra Book House – All branches*
*Navodaya Publishers – All Branches*
*Prajashakti Book House – All Branches*

**Writer Email:**
*Anil.s.royal@gmail.com*

**వందేళ్ళపైగా** తెలుగు కథలు వస్తుంటే ఎన్ని కథలు ఎంతమంది మనసుల్లో నిలిచాయి? ఎన్ని కథలు ప్రామాణికంగా పేర్కొనబడుతున్నాయి? ఎంతమంది కథా రచయితలని ఎంతమంది పాఠకులు గుర్తుపెట్టుకున్నారు? - ఇలాంటి ప్రశ్నలకి సమాధానాలు వెదకడం మొదలెడితే ఆసక్తికరమైన విషయాలు బయటపడతాయి. ఏ రచన ఐనా - కథ ఐనా, నవల ఐనా, కవిత ఐనా, వ్యాసం ఐనా - ఎంతకాలం నిలుస్తుంది అనేది.. రచన ఎంతమందికి చేరింది అనే అంశం మీద ఆధారపడి ఉంటుంది. అలానే ఒక రచన అందరికీ నచ్చాలన్న నియమమూ లేదు. ఐతే రచయితలు కనీసం కొన్ని ప్రాథమిక నియమాలు పాటిస్తే తమ రచన ఎక్కువమంది పాఠకులకి చేరే అవకాశం ఉంటుంది. అలాంటి కొన్ని అంశాలని, ముఖ్యంగా కథారచనలో తాను పాటించే కొన్ని సూత్రాలని, ఈ పుస్తకంలో వివరించారు, కథారచయిత అనిల్ ఎస్.రాయల్. అరుదుగా కథలు వ్రాసే అనిల్ గారు కొద్దికథలే వ్రాసినా అతికొద్ది కాలంలోనే మంచిరచయితగా ప్రముఖుల ప్రశంసలనందుకున్నారు. తనదైన పంథాలో ఎక్కువగా సైన్సు ఫిక్షన్ కథలు వ్రాసే అనిల్ గారు, తాను కథలు వ్రాయడంలో తీసుకునే జాగ్రత్తలని పదిమందికీ చేర్చాలన్న ఉద్దేశంతో ఈ వ్యాసాలని వ్రాశారు. 'ఇవే నియమాలు , ఇవే సూత్రాలు ' అని రచయిత ఎక్కడా చెప్పలేదు. 'నేనిలా వ్రాస్తాను, కథలు వ్రాసే క్రమంలో నేను నేర్చుకున్న విషయాలివీ.. మీకు నచ్చితే తీసుకోండి' అని మాత్రమే చెప్పారు. ఇలాంటి విషయాలని ఆసక్తికరంగా చెప్పడం కాస్త కష్టమే. ఐనా అనిల్ ఎస్.రాయల్ తన ప్రయత్నంలో పూర్తిగా కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు. తాను చెబుతున్న ప్రతి అంశానికీ చక్కటి ఉదాహరణని జోడించి ఈ వ్యాసాలని అత్యంత ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. కేవలం కొత్తరచయితలకే కాక ఇప్పటికే కథలు వ్రాస్తున్న రచయితలకి కూడా ఈ పుస్తకంలోని కొన్ని విషయాలు పోల్చిచూసుకోడానికి ఉపయోగపడతాయి. ప్రతికథనీ ఒక అందమైన శిల్పంలా మలచాలనే ప్రయత్నంలో తాను పడే తపనని వివరంగా తెలియచేశారు రచయిత. ఏదో వ్రాసేశాం అనుకోకుండా, ప్రతి కథా ఎక్కువమంది పాఠకులకి చేరాలని ఆశించే వాళ్ళంతా తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. తమకి నచ్చిన, తాము పాటించదగిన విషయాలున్నాయనుకుంటే స్వీకరించవచ్చు. ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం వెనుకా ఎంతో ఆలోచన, విశ్లేషణ, అధ్యయనం.. కనిపిస్తాయి. ఇలాంటి విషయాలని సరళంగా, సులువుగా వివరించిన అనిల్ ఎస్.రాయల్ అభినందనీయులు.

★★★




**ప్రచురణ**

ఉషశ్రీ మిషన్

రేడియో ఆర్టిస్ట్స్ కాలనీ

విజయవాడ - 520 008

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

**రామాయణ, భారత, మహాభాగవతాలు...** తెలుగు సంస్కృతిలో అవిభాజ్యంగా కలిసిపోయాయి. ఈ ఇతిహాసాలని భక్తిభావంతో పరాయణం చేసేవారు, దైవగ్రంథాలుగా పరిగణించేవారే ఎక్కువగా ఉన్నారు. కొద్దిమంది మాత్రం ఈ మహాగ్రంథాలలోని పాత్రలని, సన్నివేశాలని సానుకూల దృక్పథంతో విశ్లేషించారు. ఏపాత్ర వ్యక్తిత్వం ఎలాంటిది, ఏ సన్నివేశంలో ఈ పాత్ర ఎలా మాట్లాడ్డం వల్ల ఎలాంటి పరిణామాలు సంభవించాయి, ఏ సన్నివేశంనుంచి ఎలాంటి పాఠాలు లేదా గుణపాఠాలు నేర్చుకోవచ్చు - లాంటి విషయాలని విశదీకరించిన కొద్దిమందిలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన పండితుడు డా.ఉషశ్రీ గారు. 1960 - 70 ప్రాంతాల్లో రేడియోలో ధర్మసందేహాలు కార్యక్రమంద్వారా అనేక సంవత్సరాలపాటు ఈ ఇతి హాసాల్లోని ధర్మసూక్ష్మాలని తెలుగువారికి అందించారు. వీరువ్రాసిన పుస్తకం 'ఎవరితో ఎలా మాట్లాడాలి?' ఇప్పటికే ప్రచురితమైంది. ఆ పుస్తకంలో, రామాయణంలోని హనుమంతుడి పాత్ర విశ్లేషణ ద్వారా ఎవరితో ఎప్పుడు ఎలా మాట్లాడాలి అనే విషయాన్ని వాల్మీకి ఎలా చెప్పాడో సోదాహరణంగా వివరించారు. ఇప్పుడు ప్రచురితమైన ఈ 'ఎవరు ఎలా మాట్లాడుతారు?' అనే పుస్తకంలో భారతంలోని రాయబారుల ప్రవర్తనలని, సంభాషణా చతురతని విశ్లేషించారు. ద్రుపదపురోహితుడు, సంజయుడు, శ్రీకృష్ణుడు.. వివిధ సందర్భాల్లో రాయబారులుగా ప్రత్యర్థుల వద్దకి వెళ్ళిన వాళ్ళే. ఒక వర్గాన్నికి ప్రతినిధిగా వ్యతిరేక వర్గం వాళ్ళ వద్దకి వెళ్ళి సంభాషించడం అంటే అది ఒక కళ. ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి, ఎదుటివారి భావోద్వేగాలకి ఎలా స్పందించాలి, ఏ సందర్భంలో ఎలా సమ్యమనం వహించాలి, ఎక్కడ ఆవేశాన్ని అదుపులో పెట్టుకోవాలి - లాంటి విషయాలు ఈ రాయబారుల పాత్రద్వారా వ్యాసమహర్షి వివరించారు. మమూలుగా మహాభారతాన్ని చదివితే ఈ ధర్మసూక్ష్మాలు అందరికీ అర్థంకాకపోవచ్చు. ఉపరితలాన్ని ఛేదించుకుని లోపలికి వెళితే ఎన్నో విలువైన మాణిక్యాలు దొరుకుతాయి. రేడియో వ్యాసుడు ఉషశ్రీగారు చేసిన పని ఇదే. ఇలాంటి పుస్తకాలు ఈ నాటి తరానికి చాలా అవసరం. శతాబ్దాల క్రిందటే అద్భుతమైన వ్యక్తిత్వ వికాసగ్రంథంగా మహాభారతాన్ని తీర్చిదిద్దిన వ్యాసమహర్షి రచనలని అత్యంత సులువైన రీతిలో తెలుగువారికి అందించిన ఉషశ్రీగారి సేవ వెలకట్టలేనిది. వారి పుస్తకాలని మరుగున పడిపోకుండా ఈ తరానికి అందిస్తున్న ఉషశ్రీ మిషన్ వారు , ముఖ్యంగా వారి కుమార్తె డా.గాయత్రిగారు అభినందనీయులు.

★★★